క్లుప్తంగా

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలి



ఆర్మూర్: ఉచిత ఫిజియోథెరపీని వైకల్యంతో బాధపడే పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో రాజగంగారాం సూచించారు. ఆర్మూర్‌లోని భవిత కేంద్రంలో శుక్రవారం ఫిజియోథెరపీ శిబిరాన్ని నిర్వహించారు. వైద్యురాలు రేణుక, ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ కిషన్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ అలేఖ్య, ఆపరేటర్ రఘువీర్ సింగ్, సీఆర్పీలు శ్రీనివాస్, సంతోష్, లత పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



నవీపేట: మండలంలోని అబ్బాపూర్(ఎం)లో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్మించే గంగమ్మ ఆలయానికి బినోల సొసైటీ చైర్మన్ మగ్గారి హన్మాండ్లు రూ.10 వేల విరాళం అందజేశారు. ఆలయ నిర్మాణానికి తన వంతు సహకారాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



బాల్కొండ: పోలింగ్ కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయాలని బాల్కొండ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు సుబ్ర చక్రవర్తి అన్నారు. శుక్రవారం బాల్కొండలో పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల వద్ద వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బందులు కలగకుండా ర్యాంపులు, మూత్రశాలలను నిర్మించాలన్నారు. తహసీల్దార్ శ్రీధర్ పాల్గొన్నారు.

మాక్ పోలింగ్



కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లిలోని కృష్ణవేణి హైస్కూల్‌లో శుక్రవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఓటింగ్ విధానం, ప్రజాస్వామ్య ఎన్నికల విధానంతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ చిలుక గంగప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ కుందారం సచిన్, ఉపాధ్యాయులు కమలాకర్, స్రవంతి, స్వప్న, రమ్య, రూపశ్రీ, సాహస్, తబసుమ్, నిఖిత పాల్గొన్నారు.

హంగర్గలో వైద్య శిబిరం



రుద్రూర్: పోతంగల్ మండలం హంగర్గలో ధన్వంతరి జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పోతంగల్ ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అవసరమగు వారికి మందులు అందచేశారు. మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్, ఆయుష్ వైద్యురాలు ప్రేమలత, పీహెచ్‌సీ డాక్టర్ ఉమా, ఫార్మసిస్ట్ పురుషోత్తం, రమణ, హెల్త్ సూపర్‌వైజర్ సాయికుమారి, సుభాషిణి, సుమలత, సమత పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి



పెర్కిట్(ఆర్మూర్): విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ప్రముఖ సినీనటి రాజశ్రీ అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో గల విజయ్ హైస్కూల్ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు రాజశ్రీ, రచయిత రమా సాండిల్య హాజరయ్యారు. పాఠశాల హెచ్‌ఎం కవితదివాకర్, ఉపాధ్యాయులు సురేష్ పాల్గొన్నారు.

మంత్రి గెలవాలని శబరిమలకు పాదయాత్ర

భీమ్‌గల్: వేముల ప్రశాంత్‌రెడ్డి మరోసారి గెలవాలని మండలంలోని సికింద్రాపూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ కుర్ర గణేశ్ శుక్రవారం శబరిమల కు పాదయాత్ర ప్రారంభించారు. జెడ్పీటీసీ చౌట్‌పల్లి రవి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు దొన్కంటి నర్సన్న పాదయాత్రను ప్రారంభించారు.

మరింత అభివృద్ధి చేస్తా

• మంత్రి ప్రశాంత్‌రెడ్డి



జాన్కంపేటలో మాట్లాడుతున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



అక్లూర్‌లో మంత్రికి బోనాలతో స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

వేల్పూర్/బాల్కొండ: ఎన్నికల్లో మళ్లీ తనను ఆశీర్వాదిస్తే, నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మెండోరా మండలం సోన్‌పేట్, దూదిగాం, బుస్సాపూర్, వేల్పూర్ మండలం అక్లూర్, జాన్కంపేట్, సాహెబ్‌పేట్ గ్రామాలలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తన నెత్తి మీద అమ్మవారు ఉందని, సీఎం కేసీఆర్ సహకారం తోడుండడంతో ప్రజలకు కావాల్సినవన్ని జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో మహిళలు, కుల వృత్తులవారు మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో చిన్న గ్రామాలకు సైతం డబుల్‌రోడ్లు వేయించానని చెప్పారు. ఎన్నికల సమయంలో కొంత మంది నాయకులు వచ్చి మాయమాటలు చెబుతారన్నారు. కానీ అభివృద్ధి చేసిన వారిని మరిచి పోవద్దని కోరారు. కాంగ్రెస్ పాలనలో రైతులు అష్టకష్టాలు పడ్డారన్నారు. సీఎం రైతుల సంక్షేమం కేసీఆర్ కృషి చేశారని పేర్కొన్నారు. కర్ణాటకలో నమ్మి ఓటేస్తే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వారు ఉన్న పింఛన్లు తీసేస్తున్నారని, పది గంటల కరెంటు హామీ ఇచ్చి ఐదు గంటలు కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. తెలంగాణా ప్రభుత్వం గ్రామ గ్రామాన కాంటాలు పెట్టి, రైతుల ధాన్యం కొనుగోలు చేస్తూ, అకౌంట్లలో డబ్బులు వేస్తోందన్నారు. రుణమాఫీపై విపక్షాలు రైతుల్లో కావాలనే అనుమానాలు రేకేత్తిస్తున్నాయని ఆరోపించారు. రుణమాఫీ ప్రతిరైతుకు అంది తీరుతుందని స్పష్టం చేశారు. ఎంపీపీలు బీమ జమున, సుకన్య, జెడ్పీటీసీలు అల్లకొండ భారతి, తలారి గంగాధర్, శేఖర్‌రెడ్డి, డాక్టర్ మధుశేఖర్, నరసింహనాయుడు, డీసీసీబీ వైస్‌చైర్మన్ రమేశ్‌రెడ్డి, నీరడిభాగ్య పాల్గొన్నారు.

మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిక

వేల్పూర్: బాల్కొండ నియోజకవర్గంలో వివిధ మండలాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం మంత్రి ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఏర్గట్ల మండలం తడ్‌పాకల్, భీమ్‌గల్ మండలం బెజ్జోర, మోర్తాడ్ మండలం షెట్పల్లి, వేల్పూర్ మండలం లక్కోర, బాల్కొండ మండలం బోదేపల్లి, మెండోరా గ్రామాలకు చెందిన నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు.

ఆర్మూర్‌లో వార్ వన్‌సైడ్

• ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి



శాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

నందిపేట్/డొంకేశ్వర్: ఆర్మూర్ నియోజకవర్గంలో వార్ వన్ సైడ్ అని, తన గెలుపు డిసైడ్ అయిపోయిందని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. నందిపేట్ మండలంలోని శాపూర్, డొంకేశ్వర్ మండలంలోని తొండకూర్, దత్తాపూర్ గ్రామాల్లో శుక్రవారం ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో, బీఆర్‌ఎస్ నాయకులు పూల మాలలతో ఘన స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. తనకు అభివృద్ధి, ప్రజాసంక్షేమం తప్ప మరో పనిలేదన్నారు. సబ్బండ వర్ణాల ఆశీస్సులు ఉన్నంత కాలం 'కారు' స్పీడ్‌నాపడం ఎవరితరం కాదన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఒక్కసారైన మీ ఊరికొచ్చారా అని ప్రశ్నించారు. పదేళ్లుగా నియోజకవర్గ అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేసిన తనను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ఒక అవినీతి పార్టీ, బీజేపీ ఒక అవకాశవాద పార్టీ అన్నారు. కారు జోరులో కాంగ్రెస్, బీజేపీ కొట్టుకుపోవడం ఖాయమని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టో పేదలకు వరమని తెలిపారు. మళ్లీ బీఆర్‌ఎస్ అధికారంలోకి రాగానే రైతుబంధు ఎకరానికి రూ.10 వేల నుంచి రూ.16 వేలకు పెంచుతామన్నారు. ఆర్మూర్ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. సర్పంచులు దేవన్న, గంగమని నాగరాజు, ఉప సర్పంచులు రాజేందర్, దిలీప్, నారాగౌడ్, లింబగౌడ్, శ్రీనివాస్, జగదీశ్, రాజేశ్వర్, భూమేశ్వర్, మహేష్ గౌడ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల పర్వం



బోధన్‌లో నామినేషన్ వేస్తున్న స్వతంత్ర అభ్యర్థి రాజేష్



బోధన్‌లో.. ఇండియా ప్రజా బంధు పార్టీ అభ్యర్థి గైని రాములు

బోధన్: బోధన్ నియోజకవర్గ అభ్యర్థులుగా ఆఖరి రోజు శుక్రవారం 16 సెట్ల నామినేషన్లు వేశారు. ఆర్డీవో ఆఫీసులోని రిటర్నింగ్ ఆఫీసర్ రాజాగౌడ్‌కు సమర్పించారు. బీఎస్పీ అభ్యర్థులుగా అమర్‌నాథ్ బాబు, సింగాడే పాండు, గైని రాములు(ఇండియా ప్రజాబంధు పార్టీ), హన్మాజీ భూపాల్‌రెడ్డి(అలయెన్స్ డెమోక్రటిక్ రిఫార్మర్స్ పార్టీ), సురేందర్ తోడే(యుగతులసీ పార్టీ), స్వతంత్ర అభ్యర్థులుగా గంధం రాజేష్, టి నవీన్‌కుమార్, అర్షద్ పాషా నామినేషన్లు వేశారు.

భీమ్‌గల్: బాల్కొండ నియోజకవర్గానికి శుక్రవారం 13 సెట్ల నామినేషన్‌లు దాఖలు అయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిత్రామిశ్ర తెలిపారు. అన్నపూర్ణమ్మ(బీజేపీ), పల్లికొండ నర్సయ్య(బీఎస్పీ), అబ్బగోని అశోక్‌గౌడ్(బహుజన లెఫ్ట్ పార్టీ), ప్రశాంత్‌రెడ్డి(బీఆర్‌ఎస్), సునిల్‌రెడ్డి(కాంగ్రెస్), మంగళవారం భోజన్న(ధర్మ సమాజ్ పార్టీ), గద్దె శ్రీనివాస్(అలయన్స్ డెమోక్రటిక్ రిఫార్మ్ పార్టీ), యశ్‌పాల్ పన్నాల(యుగ తులసి పార్టీ), శెట్పల్లి శంకర్(భారత చైతన్య యువజన పార్టీ), వీర్ల సాయిబాబు(స్వతంత్ర), కొండ రఘునాథ్(స్వతంత్ర) నామినేషన్ వేశారు.

ఆర్మూర్‌లో..

ఆర్మూర్: ఆర్మూర్ నియోజకవర్గానికి చివరి రోజు 25 సెట్ల నామినేషన్లు నమోదైనట్లు రిటర్నింగ్ ఆఫీసర్ వినోద్ కుమార్ తెలిపారు. గోర్తె రాజేందర్ స్వతంత్ర అభ్యర్థిగా, కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. పొద్దుటూరి వినయ్‌రెడ్డి(కాంగ్రెస్), ఆశన్నగారి జీవన్‌రెడ్డి(బీఆర్‌ఎస్), పైడి రాకేష్‌రెడ్డి(బీజేపీ), బొంట సాయన్న(ఉత్తర రాష్ట్ర తెలంగాణ పార్టీ), రుతె రవి(బలిరాజ పార్టీ), చెరుకు ప్రేమ్‌కుమార్(ధర్మసమాజ్ పార్టీ), బ్యాగరి భూమన్న(స్వతంత్ర), చెంచుల అశోక్(స్వతంత్ర), మాజిద్(ఎంబీటీ), గండికోట రాజన్న(బీఎస్పీ), నారాయణ్‌పేట్ రాజేష్(స్వతంత్ర), బూస రాకేష్(ఆల్ ఇండియ ఫార్వర్డ్ బ్లాక్) నామినేషన్లు వేశారు.

బీఆర్‌ఎస్ మేనిఫెస్టో బూటకం

• మాజీ ఎమ్మెల్యే అన్నపూర్ణమ్మ



ఆర్‌ఆర్ నగర్‌లో మాట్లాడుతున్న అన్నపూర్ణమ్మ

కమ్మర్‌పల్లి: అధికార దాహం కోసం బీఆర్‌ఎస్ రూపొందించిన ఎన్నికల మేనిఫెస్టో పెద్ద బూటకమని బీజేపీ బాల్కొండ అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మ అన్నారు. కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్, శ్రీరాజరాజేశ్వరీ నగర్‌లో శుక్రవారం ఆమె ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టోలో రూ.400కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని ప్రకటించారని, ప్రస్తుతం అధికారంలో ఉండి ఇవ్వకుండా, మళ్లీ గెలిస్తే ఇస్తామనడం ఏంటని ప్రశ్నించారు. రైతుబంధుతో సామాన్య రైతులకు నష్టం జరుగుతుండగా, సీఎం కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు, సన్నిహితులకు మాత్రమే లబ్ధి చేకూరుతుందని ఆరోపించారు. ఎంపీ అర్వింద్ హామీ మేరకు పసుపు బోర్డు తేవడంతో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులకు దిమ్మదిరిగి పోయిందని విమర్శించారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తే ప్రతీ వ్యక్తికి న్యాయం జరుగుతుందన్నారు. తనను గెలిపిస్తే అర్హులందరికీ ఇండ్లు, పెన్షన్లు, రేషన్ కార్డులు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. పార్టీ అసెంబ్లీ కన్వీనర్ మల్కాన్నగారి మోహన్, నిమ్మల శ్రీనివాస్, కట్ట సంజీవ్, బద్దం రమేష్ రెడ్డి, బాల్‌రెడ్డి, పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లిలో అన్నపూర్ణమ్మ సమక్షంలో ఏర్గట్ల మండల కేంద్రానికి చెందిన పలువురు యువకులు, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు బీజేపీలో చేశారు. ఏర్గట్ల మండలాధ్యక్షుడు ఏలేటి నారాయణరెడ్డి, జక్కు వంశీ, గడ్డం శ్రీనివాస్, గంగేష్ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి నామినేషన్‌కు తరలిన నాయకులు



బాల్కొండ: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి శుక్రవారం కామారెడ్డిలో నామినేషన్ వేయగా ముప్కాల్, బాల్కొండ మండలాల నుంచి నాయకులు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. ముత్యంరెడ్డి, వెంకటేశ్, జైడి రవి పాల్గొన్నారు.

ఏనుగు రవీందర్‌రెడ్డి నామినేషన్‌కు..



మోస్రా నుంచి బోనాలతో నామినేషన్‌కు బయలుదేరిన నాయకులు

వర్ని: బాన్సువాడలో శుక్రవారం కాంగ్రెస్ అభ్యర్థి ఏనుగు రవీందర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేయగా వర్ని, చందూర్, మోస్రా మండలాల నుంచి వందలాదిమంది కార్యకర్తలు తరలి వెళ్లారు. మోస్రా సీతారామ ఆలయంలో నాయకులు పూజలు నిర్వహించి ఒగ్గు కళాకారులు, మహిళలు బోనాలతో ర్యాలీ నిర్వహించి బాన్సువాడకు తరలి వెళ్లారు.

యెండల నామినేషన్‌కు..

రుద్రూర్: బాన్సువాడ అభ్యర్థి యెండల లక్ష్మీనారాయణ నామినేషన్‌కు కోటగిరి, రుద్రూర్, పోతంగల్ మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు వెళ్లా రు. నాగం సాయిలు, సుధాకర్ గౌడ్, పబ్బ శేఖర్, హరికృష్ణ, గజేందర్, హనుమాన్లు, సంగయప్ప, సతీష్ మహరాజ్ తదితరులు ఉన్నారు.

చరిత్రను తిరగరాయాలి



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి

వర్ని: స్పీకర్ పదవి చేపట్టిన వారందరూ ఎన్నికల్లో ఓడిపోతారన్న చరిత్రను బాన్సువాడ ఓటర్లు తిరగరాయాలని డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వర్నిలో వర్ని, కోటగిరి మండలాల యువగర్జన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలో యువకులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలందరికి వివరించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. బాన్సువాడ నియోజకవర్గాన్ని రాష్ట్రంలో అభివృద్ధిలో ఐదో స్థానంలో నిలబెట్టిన ఘనత శ్రీనివాస్‌రెడ్డికి దక్కిందన్నారు. శ్రీనివాస్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తే ప్రతిపక్షాల అడ్రస్సు గల్లంతు చేస్తామని హెచ్చరించారు. నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి పోచారం సురేందర్ రెడ్డి, డాక్టర్ రవీందర్ రెడ్డి, వర్ని జెడ్పీటీసీ హరిదాసు, వీర్రాజు, గోపాల్, శ్రీను, గిరి, రాజు, అశోక్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు అండర్-19 రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ దుర్గా రెడ్డి శుక్రవారం తెలిపారు. పట్టణంలో ఈ నెల 8న నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో పాఠశాలకు చెందిన ఎం అభిషేక్, కె ప్రశాంత్ సత్తా చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. సిద్దిపేట జిల్లాలో ఈ నెల 11 నుంచి నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ దుర్గారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సంధ్యారాణి అభినందించారు. ఉపాధ్యాయులు శ్రీధర్, మహేశ్వరి, సురేష్, రాములు, సురేష్, చెన్నా రెడ్డి, పీఈటీలు రాజేందర్, అర్జున్ పాల్గొన్నారు.

అండర్-17 హాకీ క్రీడాకారులు..

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మినీ స్టేడియంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి సంగీతరావు ఆధ్వర్యంలో అండర్-17 హాకీ బాలుర క్రీడాకారులు ఎంపికలు నిర్వహించారు. జిల్లా నుంచి వివిధ పాఠశాలల క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో నిర్వహించే ఉమ్మడి జిల్లాల ఎంపికల్లో పాల్గొంటారు. జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు టీ విద్యాసాగర్‌రెడ్డి, జిల్లా హాకీ సంఘం ప్రధాన కార్యదర్శి సదమస్తుల రమణ, కోశాధికారి సురేందర్, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా చైతన్యంతోనే పోరాటాలు సాధ్యం



ఆర్మూర్‌టౌన్: పోరాటాలు ప్రజా చైతన్యంతోనే సాధ్యమని సీపీఐ ఎంఎల్ రామచంద్రన్ పార్టీ ఉత్తర తెలంగాణ కార్యదర్శి సుధాకర్ అన్నారు. ఆర్మూర్‌లో శుక్రవారం గోదావరి లోయ సాయుధ రైతాంగ ప్రతిఘటన పోరాట నిర్మాత చంద్ర పుల్లారెడ్డి వర్ధంతి సభ నిర్వహించారు. పుల్లారెడ్డిని ఆదర్శంగా తీసుకుని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. నాయకులు షేక్ శావలీ, మల్లెపల్లి ప్రభాకర్, మహమూద్, శ్రీకాంత్, అరుణ, బొట్ల రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'బీఎస్పీ గెలుపు ఖాయం'



నామినేషన్ ర్యాలీ సభలో మాట్లాడుతున్న బీఎస్పీ అభ్యర్థి అమర్‌నాథ్‌బాబు

బోధన్: బహుజనుల అండతో బోధన్‌లో బీఎస్పీ గెలుపు ఖాయమని ఆ పార్టీ అభ్యర్థి ఎం అమర్‌నాథ్ బాబు అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించి నామినేషన్ వేశారు. అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. త్యాగాలతో సాధించుకున్న తెలంగాణలో బహుజనుల సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని విమర్శించారు. నిరంతరం ప్రజలకు అండగా ఉండి అభివృద్ధికి పాటుపడుతానన్నారు. ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి పాండు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తడిదుస్తులతో సిద్ధుల గుట్ట ఎక్కి..

• కాంగ్రెస్ అభ్యర్థి వినయ్‌రెడ్డి పూజలు



ఆర్మూర్ : బీఆర్‌ఎస్ పార్టీకి తాను అమ్ముడుపోయానంటూ కొందరు అసత్యపు ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ అభ్యర్థి పొద్దుటూరి వినయ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్మూర్ పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓటమి భయంతో బీఆర్‌ఎస్ నాయకులు తమ పార్టీ కార్యకర్తల మనోధైర్యాన్ని దెబ్బ తీయడానికి ఇలాంటి చీప్ ట్రిక్స్ ప్లే చేస్తున్నారన్నారు. తనపై వాళ్లు చేస్తున్న అసత్యపు ప్రచారాన్ని తిప్పి కొడుతూ తడిదుస్తులతో పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్ట ఎక్కి రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పాఠశాలల్లో దీపావళి



జెంటిల్ కిడ్స్ పాఠశాలలో..

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని లోటస్ పాఠశాలలో శుక్రవారం దీపావళి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ అంభిక, ఉపాధ్యాయులు పల్లవి, రుచిత పాల్గొన్నారు.

పెర్కిట్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి యోగేశ్వర కాలనీలో గల జెంటిల్ కిడ్ పాఠశాలలో దీపావళి సంబురాలను నిర్వహించారు. కరస్పాండెంట్ గుజరాతి ప్రకాశ్, ప్రిన్సిపల్ లత, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 - ది మార్వెల్స్ (తెలుగు)- 11.15, 1.50, 7.10, 9.45
దీపావళి (తెలుగు) - 04.25

స్క్రీన్-2 - జపాన్(తెలుగు)- 12.10, 3.30, 6.50, 10.10

స్క్రీన్-3 - జపాన్(తెలుగు)- 10.50
కీడా కోలా(తెలుగు)- 2.10, 7.40
మా ఊరి పొలిమేర (తెలుగు)- 4.50, 10.20

స్క్రీన్-4 - జిగర్ తండ డబుల్ఎక్స్ (తెలుగు)- 11.15, 2.50, 6.25, 10.00

భారీ మెజారిటీతో గెలిపించండి

• కాంగ్రెస్ ఆర్మూర్ అభ్యర్థి వినయ్‌రెడ్డి



అభివాదం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి వినయ్‌రెడ్డి

ఆర్మూర్: తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని నమ్మి తనకు ఒక్కసారి అవకాశం ఇచ్చి భారీ మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ ఆర్మూర్ అభ్యర్థి పొద్దుటూరి వినయ్‌రెడ్డి కోరారు. ఆయన నామినేషన్ దాఖలు సందర్భంగా శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. పెర్కిట్ చౌరస్తా నుంచి మామిడిపల్లి చౌరస్తా మీదుగా అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ సాగింది. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిపై పలు ఆరోపణలు చేశారు. నియోజకవర్గ లోకల్ అభ్యర్థి అయిన తనను 50 వేల భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి రైతులకు ఎకరానికి రూ.15 వేలు, రైతు కూలీలకు రూ.12 వేల ఆర్థిక సహాయాన్ని అందిస్తామన్నారు. పసుపు పంటకు క్వింటాలుకు రూ.12 వేల నుంచి రూ. 15 వేల గిట్టుబాటు ధరను ఇస్తామని హామీ ఇచ్చారు.



వినయ్‌రెడ్డి నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న ప్రజలు

బీసీలకు రాజ్యాధికారం బీజేపీతోనే సాధ్యం

• బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్

సుభాష్‌నగర్: రాష్ట్రంలో 52 శాతమున్న బీసీలకు రాజ్యాధికారం బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. శనివారం బీజేపీ నిజామాబాద్ రూరల్ అభ్యర్థి దినేష్ కులాచారి నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి రాజేంద్రకుమార్‌కు అందజేశారు. కార్యక్రమానికి ఈటల రాజేందర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా మొదటి నుంచి బీజేపీ పట్టుకొమ్మలా ఉందన్నారు. ప్రధాని మోదీ పసుపు బోర్డు ప్రకటనతో ఈ ప్రాంతంలోని అన్ని నియోజకవర్గాల్లో బీజేపీపై విశ్వాసం పెరిగిందని, ఈసారి కమలం పువ్వు గుర్తుకు ఓటేయాలని రైతాంగం భావిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర చరిత్రలో బీసీ, ఎస్సీని సీఎం చేసే అవకాశం ఏ పార్టీకి రాలేదని, 50 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ 52శాతమున్న బీసీలకు కనీస గౌరవం, గుర్తింపు ఇవ్వలేదన్నారు. ప్రాంతీయ పార్టీలైన టీడీపీ కుటుంబ పార్టీగా ఉందని, బీఆర్‌ఎస్ బతికున్నంత వరకూ సీఎం, పార్టీకి ఆ కుటుంబ సభ్యుల చేతిలోనే ఉంటుందని ఎద్దేవాచేశారు. బీసీని సీఎం చేస్తామని ప్రధాని మోదీ ప్రకటిస్తే.. రాహుల్‌గాంధీ వెకిలిగా మాట్లాడారని ఆరోపించారు. చాపకింద నీరులా బీజేపీ రాష్ట్రంలో, జిల్లాలో అత్యధిక స్థానాల్లో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తంచేశారు.